ప్రజాశక్తి
సోమవారం 9 అక్టోబరు 2023

అరసవల్లి సందర్శన

చిత్రపటాన్ని స్వీకరిస్తున్న నాగలక్ష్మి, నవీన్

శ్రీకాకుళం అర్బన్ : అరసవల్లి సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని విజయనగరం జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి, శ్రీకాకుళం జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్ కుటుంబ సమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. అలాగే తిరుపతి నగర మేయర్ డాక్టర్ రాచ శిరీష యాదవ్ కుటుంబ సభ్యులతో కలిసి దర్శించుకున్నారు. వారికి ఆలయ మర్యాదలతో ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకరశర్మ స్వాగతించారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం వారికి శేషవస్త్రాలను ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ కప్పి చిత్రపటాలను అందజేశారు.

పలాసలో కంకర అనకొండలు

ఒకప్పుడు జగనన్న కాలనీ ప్రాంతంలో కొండలు కనిపించేవి. నేడు ఆ కొండలు కనుమరుగవుతున్నాయి. నెలలు గడుస్తున్నా సమయంలో కొండలు తవ్వి కంకర తరలిపోతున్న తరుణంలో కొండలు మాయమవుతున్నాయి. ఇష్టానుసారంగా రాత్రి, పగలు తేడాలేకుండా కంకర తవ్వకాలు చేపడుతుండడంతో టన్నులకొద్దీ కంకర విక్రయించి కంకర మాఫియా ప్రతినిధులు కోట్లు సంపాదించికుంటున్నారు. ఇవన్నీ రెవెన్యూ, మైన్స్ అధికారుల కనుసన్నలలో జరుగుతున్నాయన్న ఆరోపణలు జోరుగా వినిపిస్తున్నాయి.

యథేచ్ఛగా తవ్వుతున్న కంకర

- **కళ్లెదుటే మాయం**
- **ఇష్టానుసారంగా తవ్వకాలు**
- **పట్టించుకోని రెవెన్యూ, మైన్స్ అధికారులు**

ప్రజాశక్తి - పలాస

కాశీబుగ్గ పట్టణానికి సమీపంలో ఉన్న కోసంగిపురం కూడలి వద్ద పేద ప్రజల ఇళ్ల నిర్మాణాలకు జగనన్న కాలనీలో భాగంగా స్థలాలు పంపిణీ చేశారు. ఆ ప్రాంతంలో కొండలు కనిపించేవి. రామకృష్ణాపురం రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 148లో ఉన్న భూములు కాలనీకి, మెండు అటవీ భూములకు మధ్య వారధిగా ఉండేది. కాలనీ నిర్మాణంలో కొంత కొండ కరిగిపోగా మిగిలిన భాగంలో హిందు, ముస్లిమ్, క్రిష్టియన్లకు 50 సెంట్లు చొప్పున శ్మశానం కోసం కేటాయిస్తున్నట్లు రెవెన్యూ అధికారులు చెబుతున్నారు. మిగిలిన కొండ యథాతథంగా ఇప్పటి వరకూ ఉండేది. ఈ క్రమంలో రియల్ ఎస్టేట్ వెంచర్లు నిర్మాణం జోరందుకోవడం తో అక్కడున్న కంకర కొండపై అక్రమార్కుల కన్ను పడింది. వారం రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కొండను రెండు ప్రొక్లెయిర్ల సహాయంతో కంకర తవ్వి పిండి చేస్తూ కంకరను తరలించుకుపోతున్నారు. వాస్తవానికి మైన్స్ విభాగం దీన్ని పరిశీలించి నిబంధనల మేరకు అనుమతులు ఇవ్వాల్సి ఉంది.

ఇదిలా ఉండగా రాళ్లు, కంకర, ఇసుక తరలించేందుకు ప్రయివేటు వ్యక్తుల వద్ద విశ్వ సముద్ర గ్రూప్ సెస్ వసూళ్లు చేయడానికి అనుమతులు ఉన్నాయి. అయితే తవ్వకాలకు మాత్రం రెవెన్యూ అధికారులు ఇచ్చిన ఎన్‌సి ప్రకారం మైన్స్ అధికారులు అనుమతులు ఇవ్వాల్సి ఉంది. పై మూడు పనులు జరగకుండానే కొండను తవ్వి కంకరను తరలిస్తుండడం సర్వత్రా విమర్శలకు దారితీస్తోంది. తాము రాజకీయ నాయకుల అనుమతులు తీసుకున్నామని, తాము రాజకీయ నాయకుల అనుమతులు తీసుకున్నామని, మరెవరి అనుమతులు అవసరం లేదన్న చందంగా నిర్వాహకులు వ్యవహరిస్తుండడం విశేషం. ఇప్పటికే నియోజకవర్గంలో కొండలను తవ్వి కంకరను తరలించ కుపోతున్నారని విమర్శలు ఉన్న నేపథ్యంలో మళ్లీ అక్రమంగా కొండలను తవ్వడం చర్చనీయాంశంగా మారింది.

ఈ విషయంపై తహశీల్దార్ ఎల్.మధుసూదనరావును వివరణ కోరగా తమ దృష్టికి ఈ విషయం రాలేదని, గతంలో తవ్వగా తాము అడ్డుకొని ట్రాక్టర్ యజమానులపై కేసులు నమోదు చేశామని తెలిపారు. ప్రస్తుతం జరుగుతున్న విషయంలో ఫీల్డ్ సర్వే చేసి సంబంధిత ట్రాక్టర్, ప్రొక్లెయినర్ సిబ్బందిపై చర్యలు తీసుకుంటామన్నారు.

ట్రాక్టర్లతో తరలింపు

రెవెన్యూ, మైన్స్ అధికారుల నుంచి ఎటువంటి అనుమతులు తీసుకోకుండా కంకర తవ్వి ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. ఇటీవల కాలంలో అక్రమ లే అవుట్లు ఇష్టానుసారంగా పుట్టగొడుగులా వేయడంతో రాత్రి, పగలు తేడాలేకుండా ట్రాక్టర్ లోడ్ సుమారు రూ.వెయ్యి నుంచి రూ.1200 వరకు అమ్ముకుంటున్నారని, డిమాండ్ బట్టి ధర ఇష్టానుసారంగా పెంచుకుంటూ పోతున్నారని తెలుస్తోంది. ట్రాక్టర్ లోడ్‌తో కంకర తరలించే సమయంలో కంకర తవ్వకాలు చేపట్టిన వ్యక్తులు బిల్లు తప్పని సరిగా ఇవ్వాలి. రోడ్డు పైకి ట్రాక్టర్ లోడ్ వచ్చే సరికి విశ్వ సముద్ర సంస్థ ప్రతినిధులకు రూ.300లు చెల్లించాల్సి ఉంటుంది. కానీ, అక్రమ కంకర తవ్వకాలు చేపడుతుండడంతో ప్రభుత్వానికి కోట్ల రూపాయల ఆదాయం రాకుండా పోతుంది. ప్రభుత్వానికి చేరాల్సిన ఆదాయం కాశీబుగ్గ కంకర మాఫియా ప్రతినిధుల జేబులోకి చేరుతున్నట్లు తెలుస్తోంది. రామకృష్ణాపురం జగనన్న కాలనీ సమీపంలో ఉన్న కంకర కొండ కంకర మాఫియా ప్రతినిధులకు ధన కొండగా మారింది. ఎంత తవ్వుకుంటే అంతలా అక్షయ పాత్రలా మారింది.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు

శాస్త్రీయ దృక్పథంపై విస్తృత ప్రచారం

జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గిరిధర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

మూఢనమ్మకాలు, అశాస్త్రీయ భావనలు పెరుగుతున్న నేపథ్యంలో జన విజ్ఞాన వేదికగా శాస్త్రీయ దృక్పథాన్ని విస్తృతంగా, నిరంతరాయంగా ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని, ఫిబ్రవరి 28 వరకు క్యాంపెయిన్ కొనసాగించాలని జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి గొంటి గిరిధర్ పిలుపు నిచ్చారు. నగరంలోని యుటిఎఫ్ భవనంలో జెవివి జిల్లా అధ్యక్షులు కుప్పిలి కామేశ్వరరావు అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశం ఆదివారం నిర్వహించారు. ముందుగా ప్రముఖ వ్యవసాయ శాస్త్రవేత్త ప్రొఫెసర్ ఎం.ఎస్.స్వామినాథన్ మృతికి సంతాపం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్టు, సంబరాలు వచ్చే నెల 18న పాఠశాల స్థాయిలో, 30న మండలస్థాయిలో, డిసెంబరు 17న జిల్లా స్థాయిలో, జనవరి 27న రాష్ట్రస్థాయిలో విశాఖపట్నంలో నిర్వహించనున్నట్లు తెలిపారు. చెకుముకి సంబరాలను విజయవంతం చేయాలని పిలుపు నిచ్చారు. విద్యార్థి చెకుముకి పత్రిక ఎక్కువ మంది విద్యార్థులకు చేర్చేందుకు సభ్యులు కృషి చేయాలన్నారు. ఈ నెల 15, 16 తేదీల్లో సైన్స్ ఉద్యమం దక్షిణాది రాష్ట్రాల ప్రాంతీయ సమావేశం ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ ఆధ్వర్యాన కాకినాడలో నిర్వహిస్తున్నట్లు చెప్పారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా సదస్సులు, సెమినార్లు, రౌండ్‌టేబుల్ సమావేశాలు, కాన్ఫరెన్స్‌లు నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. శాస్త్రీయ విజ్ఞానం ప్రచారం కోసం విరివిగా పోస్టర్లు ముద్రించి ప్రచార కార్యక్రమాలు చేపట్టాలన్నారు.

సమావేశంలో సాంస్కృతి విభాగం నాయకులు శ్రీనివాసులు, రామస్వామి, సంజీవరావు, వేదవతి గేయాలను ఆలపించారు. సమావేశంలో జిల్లా పాటర్న్ కొత్తకోట అప్పారావు, జిల్లా ఉపాధ్యక్షులు జగన్మోహనరావు, జిల్లా కార్యదర్శి ఎస్.సంజీవరావు, జిల్లా ఆడిట్ కన్వీనర్ బోగెల ఉమామహేశ్వరరావు, సమత విభాగం నాయకులు తంగి ఎర్రమ్మ, పి.వేదవతి, సాంస్కృతిక విభాగం నాయకులు ఎస్.శ్రీనివాసులు, పైడి రామస్వామి, పర్యావరణ కమిటీ నాయకులు అగత మూడి వాసుదేవరావు, సైన్స్ అండ్ కమ్యూనికేషన్ నాయకులు హెచ్.మన్మథరావు, విద్యావిభాగం నాయకులు ఎస్.నరసింహమూర్తి, కె.ఎల్.నారాయణ, ఎం.తవిటిబాబు, వైద్య విభాగం నాయకులు ఆర్.చిన్నారావు, యువజన విభాగం నాయకులు బర్రి పురుషోత్తం పాల్గొన్నారు.

కెఆర్ స్టేడియం నిర్మాణం వేగవంతం

రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు

మాట్లాడుతున్న మంత్రి ధర్మాన ప్రసాదరావు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

సుదీర్ఘ కాలం పాటు పనులు నిలిచిపోయిన కోడి రామ్మూర్తి స్టేడియం పునర్నిర్మాణం పనులు త్వరితగతిన నిర్మించేందుకు కృషి చేస్తామని రెవెన్యూ మంత్రి ధర్మాన ప్రసాదరావు అన్నారు. థ్యాంక్ యూ సిఎం పేరిట వైసిపి ఆధ్వర్యాన స్టేడియం వద్ద ఆదివారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సిఎం నగరానికి వచ్చినప్పుడు హామీనిచ్చారని, ఈ మేరకు రూ.12 కోట్లు నిధులు మంజూరు చేసి మాట నిలబెట్టుకున్నారని అన్నారు. ఎన్ని కష్టాలు వచ్చినా ఇచ్చిన మాట నిలబెట్టుకునే వ్యక్తి జగన్ అని ప్రశంసించారు.

క్రీడల అభివృద్ధికి ప్రభుత్వం ఎంతగానో ప్రోత్సహిస్తున్నట్టు చెప్పారు. పాలనా సంస్కరణలతో పాటు సంక్షేమానికి ప్రాధాన్యత నిస్తున్నామని అన్నారు. ఫిబ్రవరి నాటికి జిల్లా కేంద్రంలో ఇంటిగ్రేటెడ్ కలెక్టరేట్ నిర్మాణం పూర్తవుతుందని అన్నారు. ఆ భవన నిర్మాణం తాను సాధించిన విజయంగా చెప్పారు. కార్యక్రమంలో జిల్లా వైసిపి అధ్యక్షులు, నరసన్నపేట ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్, కార్పొరేషన్ చైర్మన్లు అంధవరపు సూరిబాబు, మామిడి శ్రీకాంత్, నగర వైసిపి అధ్యక్షులు సాధు వైకుంఠరావు, ఎంఎస్‌ఆర్, గులోనా, సుంకరి కృష్ణ, సుందరరావు, మెంటాడ స్వరూప్, సాంబమూర్తి పాల్గొన్నారు.

ఆమదాలవలస ప్రత్యేక అధికారిగా రత్నాల

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని ఆమదాలవలస మండల ప్రత్యేక అధికారిగా జిల్లా ఉద్యానశాఖ ఎడి రత్నాల వరప్రసాద్‌ను నియమిస్తూ కలెక్టర్ శ్రీకేష్ లాఠకర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో ఆయన కంచిలి, ఇచ్ఛాపురం, మందస, గార మండలాల్లో ప్రత్యేకాధికారిగా బాధ్యతలు నిర్వర్తించారు. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు మరింత వేగవంతం కావడానికి ఆయన పర్యవేక్షణాధికారిగా వ్యవహరించనున్నారు.

పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలి

యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర

మాట్లాడుతున్న రవీంద్ర

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

ప్రభుత్వం ఇచ్చిన హామీ ప్రాప్తికి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఉద్యోగ, ఉపాధ్యాయులు సిపిఎస్, జిపిఎస్ అంగీకరించేది లేదని యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి చౌదరి రవీంద్ర పేర్కొన్నారు. నగరంలోని యుటిఎఫ్ కార్యాలయంలో సంఘం జిల్లా అధ్యక్షులు పొందూరు అప్పారావు అధ్యక్షతన జిల్లా ఆఫీసు బేరర్ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ఉత్తర్వుల ప్రాప్తికి 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులను పాత పెన్షన్ పరిధిలోకి తీసుకురావాలన్నారు. ఏదైనా సంస్కరణ అంటే మంచి కోసం అమలు చేయాలన్నారు. ఎక్కువ మంది విద్యార్థులు పాఠశాల ఆకర్షించడానికి, ఉపాధ్యాయుల సంఖ్యను పెంచి నాణ్యమైన విద్య అందించడానికి కృషి చేయాలన్నారు. దీనికి భిన్నంగా పాఠశాల సంఖ్య కుదింపు, ఉపాధ్యాయుల సంఖ్య తగ్గింపు, ఉపాధ్యాయులపై పనిఒత్తిడిని పెంచడం సరికాదన్నారు. దీని కోసం జిఒ 117ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందన్నారు. ఈ జిఒ ఉపాధ్యాయుల్లో, ప్రజల్లో, విద్యార్థుల్లో వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ప్రభుత్వం మొండిగా, పాలసీ పేరుతో అమలు చేస్తుందని అన్నారు. యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్.కిషోర్‌కుమార్ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగంలో తీసుకొచ్చిన సంస్కరణల వల్ల 25 వేల ఉపాధ్యాయ పోస్టులు కనుమరుగయ్యాయన్నారు. 4,600 పైగా ప్రాథమిక పాఠశాలలు విలీనం జరిగిందని, 14,200 ఏకోపాధ్యాయ పాఠశాలలుగా మారాయని అన్నారు. 2,200 పాఠశాలల్లో 98 లోపు ఎన్రోల్మెంట్ ఉన్న ఫ్రీ హైస్కూళ్లలో విద్యార్థులు సక్రమంగా ఎన్రోల్మెంట్ కాలేదని అన్నారు. 505 హైస్కూళ్లలో విద్యార్థుల సంఖ్య తగ్గిందన్నారు. 18 వేల పాఠశాలల్లో ఈ ఏడాది ఎన్రోల్మెంట్ అరకొరగా ఉన్నట్లు చెప్తున్నారన్నారు. ఇటువంటి విధానాల వల్ల భవిష్యత్‌లో వేలాది ప్రాథమిక పాఠశాలలు మూతపడతాయని అన్నారు. ఈ ఏడాది మూడున్నర లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలను విడిచి ప్రయివేటు స్కూళ్లలో చేరినట్టు గణాంకాలు చుపుతున్నాయన్నారు. నాడు-నేడు, జెవికె కిట్లు, అమ్మఒడి, భవనాలు, ఇతర మౌలిక వసతులు సమకూర్చి ఉపాధ్యాయులను కుదించారని అన్నారు. పోస్టుల భర్తీ చేయకుండా ఉన్న ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నార న్నారు. మరోవైపు పర్యవేక్షణ పేరుతో మానసిక వేధింపులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. పిల్లలకు మాతృభాషలో విద్య అందించాల్సిన స్థానంలో బైజుస్, ఎన్‌సిఇఆర్‌టి, సిబిఎస్‌సి సిలబస్, టోఫెల్, ఐబి అనే కొత్తకొత్త విధానాలను అమలు చేస్తున్నారని అన్నారు. దీనివల్ల పాఠశాలలకు విద్యార్థులు దూరమవుతున్నారన్నారు. ఇటువంటి సంస్కరణల వల్ల ప్రభుత్వ విద్యారంగానికి తీరని నష్టమన్నారు. పాఠశాలలకు మిగిలిన విడతల గ్రాంట్లు వెంటనే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా గౌరవ అధ్యక్షులు కె.వైకుంఠరావు, సహాధ్యక్షులు ఎల్.బాబూరావు, కోశాధికారి బి.శ్రీరామ్మూర్తి, జిల్లా కార్యదర్శులు హనుమంతు అన్నాజీరావు, పి.సూర్యప్రకాశరావు, వై.వాసుదేవరావు, జి.నారాయణరావు, జి.సురేష్, పి.మురళీధరరావు, జి.శారద, బి.రవికుమార్ పాల్గొన్నారు.

అంతిమ విజయం చంద్రబాబుదే

టిడిపి జిల్లా అధ్యక్షుడు రవికుమార్

మాట్లాడుతున్న రవికుమార్

ప్రజాశక్తి- ఆమదాలవలస

నీతికి, నిజాయితీకి, ధర్మానికి, అదర్మానికి జరుగుతున్న పోరాటంలో అంతిమ విజయం చంద్రబాబుదేనని టిడిపి జిల్లా అధ్యక్షుడు, నియోజకవర్గ ఇన్‌ఛార్జి కూన రవికుమార్ అన్నారు. పట్టణంలోని టిడిపి కార్యాలయం వద్ద ఆమదాలవలస మండలానికి చెందిన నాయకులు, కార్యకర్తలు, బూత్ లెవెల్ ఏజెంట్లు 'నేను సైతం బాబు కోసం' ఆదివారం నిర్వహించిన రిలే నిరాహార దీక్షలో పాల్గొన్నారు. దీక్షా శిబిరాన్ని సందర్శించి టిడిపి మండల అధ్యక్షుడు నూక రాజుకు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. అనంతరం మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు నీతి, నిజాయితీ కలిగిన వ్యక్తి కనుకనే సుప్రీం కోర్టులో క్యాష్ పిటిషన్ దాఖలు చేశారని అన్నారు. సిఎం జగన్మోహన్‌రెడ్డి అవినీతి ఆరోపణ కేసుల్లో ఒక్కసారైనా దాఖలు చేశారా? అని ప్రశ్నించారు. నీతిపరుడుకు, అవినీతిపరుడుకు అదే తేడా అని అన్నారు. న్యాయం ఎప్పుడూ ధర్మం వైపే ఉంటుందన్నారు. చంద్రబాబును రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. రెండు మూడు రోజుల్లో చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా బయటకు వస్తారని, రామన్న ఎన్నికల్లో వైసిపి ఇంటికి వెళ్లడం ఖాయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సనపల డిల్లేశ్వరరావు, తమ్మినేని సుజాత, చంద్రశేఖర్, బోనెల అప్పారావు, సర్పంచ్‌లు సనపల చెల్లంనాయుడు, బొడ్డేపల్లి గౌరీపతిరావు, గొండు రమణ, చేపేన సత్తిరాజు, ఎండ అప్పలనాయుడు పాల్గొన్నారు.

పోటీలను ప్రారంభిస్తున్న సురేష్‌కుమార్

ఉత్సాహంగా జిల్లాస్థాయి ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లాకి చెందిన ఫెన్సింగ్ క్రీడాకారులు రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో కూడా సత్తా చాటాలని ఫెన్సింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు బలభద్రుని సురేష్ కుమార్ (రాజా) సూచించారు. జిల్లా ఫెన్సింగ్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని టౌన్ హాల్‌లో అండర్-23, సీనియర్ విభాగాల్లో పురుషులకు, మహిళలకు వేర్వేరుగా ఆదివారం నిర్వహించిన ఈ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న ఫెన్సింగ్ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడాకారులకు అసోసియేషన్ నుంచి ఎల్లప్పుడూ ప్రోత్సాహం ఉంటుందన్నారు. ఈ నెల 14,15 తేదీల్లో కాకినాడలో జరగనున్న 10వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ సీనియర్ మెన్ అండ్ ఉమెన్, 7వ రాష్ట్రస్థాయి ఇంటర్ డిస్ట్రిక్ట్ యూత్ (అండర్ -23) పోటీల్లో పాల్గొని సత్తాచాటాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి జోగిపాటి వంశీ, కోశాధికారి డి.భవానీ, రాహుల్, దిబ్బ దిలీప్‌కుమార్, వైశ్యరాజు మోహన్, గిడుతూరి వెంకటేశ్వరరావు, సుధీర్ వర్మ, గురుగుబెల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

పోర్టిఫైడ్ బియ్యంపై అపోహలు వద్దు

- **వీటితో సూక్ష్మపోషకాలు లభ్యం**
- **సమర్థవంతంగా ఇంటింటికీ సరుకుల పంపిణీ**
- **జిల్లా పౌర సరఫరాల అధికారి వెంకటరమణ**

డి.వి రమణ, జిల్లా పౌర సరఫరాల అధికారి



ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

తల్లి గర్భం నుంచి సంపూర్ణ ఆరోగ్యానికి పునాది వేసేందుకు ప్రభుత్వం పోషకాహారం గల ఫోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా అందిస్తోందని జిల్లా పౌర సరఫరాల అధికారి డి.వి.రమణ తెలిపారు. ఈ బియ్యంపై ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని అన్నారు. కొందరు వీటిని ప్లాస్టిక్ బియ్యంగా ప్రచారం చేయడం సరికాదన్నారు. ఈ బియ్యంపై అవగాహన లేకపోవడంతో ఇటువంటి ప్రచారం సాగుతోందన్నారు. అపోహలు విడనాడి పోర్టిఫైడ్ బియ్యాన్ని ప్రతి కుటుంబమూ వినియోగించు కోవాలన్నారు. జిల్లా వ్యాప్తంగా ప్రజా పంపిణీ వ్యవస్థతో పాటు మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలకు ఈ బియ్యాన్ని సరఫరా చేస్తున్నట్టు తెలిపారు. ఈ బియ్యం వినియోగించడం వల్ల సంపూర్ణ పోషకాలు లభ్యమవుతాయని వివరించారు. ప్రతిఒక్కరూ వినియోగించేలా విస్తృతమైన అవగాహన కల్పిస్తున్నట్టు తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థ సమర్థవంతంగా పారదర్శకంగా ఉండేందుకు ఎప్పటికప్పుడు వెబ్‌సైట్లో పూర్తి వివరాలు అందుబాటులో ఉంచుతున్నట్టు తెలిపారు. పలు అంశాలను 'ప్రజాశక్తి' ముఖాముఖిలో వెల్లడించారు.

? ప్రజాపంపిణీ ఎలా సాగుతోంది?

జిల్లాలో ప్రస్తుతం 6,69,858 రేషన్ కార్డులు ఉన్నాయి. వాటిలో 6,22,423 కార్డులు ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ పరిధిలో ఉండగా, మిగిలిన 43,276 కార్డులు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉన్నాయి. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కార్డుల పరిధిలో 18,60,072 యూనిట్లకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో 1,14,197 యూనిట్లకు ఫోర్టిఫైడ్ బియ్యాన్ని సరఫరా చేస్తున్నాం. ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎ కార్డుదారులు రెండు తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడి నుంచైనా బియ్యం తీసుకునేందుకు వీలుంది. రాష్ట్ర ప్రభుత్వ కార్డుల్లో మాత్రం రాష్ట్ర పరిధిలో ఏ డిపో నుంచైనా తీసుకోవచ్చు. వీటికి తోడు జిల్లాలో మధ్యాహ్న భోజన పథకానికి, అంగన్వాడీ కేంద్రాలకు కలుపుకుని ప్రతినెలా 9760 మెట్రిక్ టన్నుల బియ్యం సరఫరా చేస్తున్నాం. అయితే పంపిణీ అవుతున్న బియ్యాన్ని ప్లాస్టిక్ బియ్యంగా కొందరు ప్రచారం చేయడంతో ప్రజల్లో అపోహలు వస్తున్నాయి. అపోహలు వీడి ఈ బియ్యాన్ని వినియోగించుకుంటే మంచి పోషక విలువలు అందుతాయి.

? కొన్ని కుటుంబాలకు రేషన్ కార్డులు నిలిపి వేశారు. వాటిని ఎప్పుడు పునరుద్ధరిస్తారు?

రేషన్ కార్డులు అర్హులైన ప్రతి కుటుంబానికీ ప్రభుత్వం మంజూరు చేస్తోంది. అయితే ప్రభుత్వ నిబంధనలకు లోబడి ఉన్నవారికి మాత్రమే రేషన్ కార్డు కలిగి ఉంటారు. విద్యుత్ బిల్లులు, ఆర్థికంగా ఉన్న వారు, ప్రభుత్వ ఉద్యోగులు, మూడు ఎకరాలకు పైగా భూములున్న వారికి ప్రభుత్వ నిబంధనల కారణంగా రేషన్ కార్డులు నిలిచిపోయాయి. నిబంధనలకు లోబడి కార్డు పొందడానికి వారు అనర్హులని డాక్యుమెంట్ల ప్రాప్తికి గుర్తించిన తర్వాతే కార్డులు తొలగించాం. ప్రభుత్వ డాష్‌బోర్డులో ప్రస్తుతం అర్హతలు కలిగి ఉన్న వారి కార్డు వివరాలు పొందు పరిచాం. ఎక్కడైనా అర్హులై ఉండి రేషన్ కార్డు పొందలేకపోతే సచివాలయంతమ అర్హతలను రుజువు చేసే పత్రాలు సమర్పించి 90 రోజుల్లో కార్డు పొందడానికి ప్రభుత్వం వీలు కల్పించింది.

? ప్రస్తుతం జిల్లాలో ఎన్ని రేషన్ డిపోలు కొనసాగిస్తున్నారు?

ప్రజా పంపిణీ వ్యవస్థలో వస్తున్న మార్పులకు అనుగుణంగా గతం కంటే రేషన్ షాపుల సంఖ్య పెరిగింది. జిల్లాలో ప్రస్తుతం 3,358 రేషన్ దుకాణాలు ఉన్నాయి. ఈ దుకాణాల పరిధిలో ఎండియు వాహనాలను ప్రవేశపెట్టి ఇంటివద్దకే ప్రభుత్వం సరకులు అందిస్తోంది. లబ్ధిదారుల నుంచి యాప్ ద్వారా తంబ్ సిగ్నేచర్ ఆధారంగా వీటిని అందించాం. కార్డులో ఉన్న లబ్ధిదారులు ఎవరైనా వెళ్లి తంబ్ వేసి సరకులు తీసుకునేందుకు వీలు కల్పించాం. సరకుల పంపిణీ కూడా పారదర్శకంగా సాగుతోంది. యాప్‌లో నమోదైన వెంటనే పౌరసరఫరాలశాఖ డాష్‌బోర్డులో నమోదవుతుంది. ఎవరెన్ని యూనిట్లు తీసుకున్నారు. ఎంత సమయానికి వారికి పంపిణీ జరిగింది తదితర వివరాలు అందులో నమోదవుతున్నాయి. దీనివల్ల ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎటువంటి లోపాలకు తావుండదు. మధ్యాహ్న భోజన పథకం, అంగన్వాడీ కేంద్రాలకు ఇదే తరహాలో సరకులు అందిస్తున్నాం.

? సరుకు పంపిణీ సమయంలో హెచ్చు తగ్గులను ఎలా సరిచేశారు?

గతంలో డీలరు వద్దకు వెళ్లి సరకులు తీసుకునేవారు. కార్డు దారులు సకాలంలో దుకాణం వద్దకు వెళ్లినా క్యూలైన్లలో నిలబడి తీసుకోవాల్సి వచ్చేది. కానీ ప్రస్తుతం ఇంటివద్దకే వచ్చి సరకులు ఇస్తున్నారు. తూనికల్లో హెచ్చు తగ్గులకు అవకాశం ఉండదు. హైయాక్యురసీ కలిగిన కంప్యూటర్ తూకం ద్వారా సరకులు అందిస్తున్నాం. ఎక్కడా తగ్గుదల కనిపించదు.

? లీగల్ మెటలర్జీ సేవలు ఎలా అందుతున్నాయా?

గతంలో ప్రభుత్వం లీగల్ మెటలర్జీ విభాగాన్ని ఏర్పాటు చేసింది. అక్కడ జిల్లా వాప్యంగా పర్యవేక్షణకు నలుగురు, ఐదుగురు ఉద్యోగులు మాత్రమే పని చేసేవారు. కానీ, ప్రస్తుత పౌరసరఫరాలశాఖ ఎండీ హనుమంతు అరుణకుమార్ ఈశాఖను మరింత బలోపేతం చేసేందుకు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా లీగల్ మెటలర్జీ విభాగానికి సచివాలయాల్లోని ఇంజినీరింగ్ సహాయకులకు అనుసంధానం చేశారు. దీనివల్ల పర్యవేక్షణ క్షేత్ర స్థాయిలో మరింత పెరిగింది. లోపాలకు తావు లేకుండా ఈశాఖ బాధ్యతలు నిర్వర్తించడానికి దోహదపడుతోంది.

? ఎన్ని సరుకులు పంపిణీ చేస్తున్నారు?

ప్రజా పంపిణీ వ్యవస్థలో నిత్యావసర సరకుల్లో బియ్యం, పంచదార సరఫరా అవుతోంది. గతంలో కందిపప్పు సరఫరా ఉండేది. ప్రస్తుతం కందిపప్పు నిల్వలు లేకపోవడం వల్ల సరఫరా నిలిచిపోయింది. ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన తర్వాత సరపడినంత మేరకు నిల్వలు ఉంటే పంపిణీ ప్రారంభిస్తాం.

BEFORE THE HONORABLE COURT OF PRINCIPAL JUNIOR CIVIL JUDGE AT ANAKAPALLI
I.A.NO.345/2021 IN O.S.NO. 201/2019

Between:
Gatta Satyanarayana and another ... Petitioners/Plaintiffs
And:
Konathala Satyanarayana ... Respondent/Defendant

NOTICE

To
Smt Akkinapalli Vijaya Syamala
W/o. A. Venkata Rama Subrmanyam
Door No.5-00, Kalamandir Street,
Palakonda Village, Palakona Mandal,
Srikakulam District – 532440

Where the petitioners/plaintiffs herein above filed the above said application against you seeking impleadment as a proposed party being a 2nd respondent/ defendant under Order – 10 rule (2) of Civil Procedure Code in the above suit and for amendments of pleading in the suit and for other reliefs. Whereas it is found to the satisfaction of the Hon'ble Court that you have been evading receipt of notice in the above application consistently. The above mentioned proposed party being 2nd respondent/ defendant is therefore hereby directed to appear before the Hon'ble Principal Junior Civil Judge, Anakapalli either in person or through an Advocate or duly Authorized agent, in support of your defence to show cause on **20-10-2023 at 10.30 A.M** (Forenoon) as to why reliefs prayed for should not be granted. Take notice that in case of your default to appear before the Hon'ble Principal Junior Civil Judge, Anakapalli, the said application will be heard and determined in your absence.

S.ARUN DEV, Advocate,
Visakhapatnam. Cell:9848566903

ఎంపికైన రాష్ట్ర జట్టు

ఖోఖో రాష్ట్ర జట్టు ఎంపిక

ప్రజాశక్తి- టెక్కలి

ఈ నెల 22 నుంచి 24 వరకు చిత్తూరు జిల్లాలో జరగనున్న రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు జిల్లా నుంచి జట్టు ఎంపిక ఆదివారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరిగింది. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీలను జిల్లా ఖోఖో ఆసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు చిట్టి నాగభూషణం, చిట్టి ఫల్గుణరావు ప్రారంభించారు. అండర్-18 బాలికల ఎంపిక పోటీల్లో భాగంగా ఎంపికైన రాష్ట్ర జట్టుని వారు అభినందించారు. ఈ ఎంపికల్లో అసోసియేషన్ కోశాధికారి బాడాన నారాయణరావు, వ్యాయామ ఉపాధ్యాయులు నాగళ్ల రమేష్, కె.కె.రామిరెడ్డి, కుప్పిలి ప్రకాష్, కాపల రఘునాథరావు, లక్ష్మణ రాజా, పాండవుల జగదీష్, జగ్గమ్మ, శైలజ, వెంకి, జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

నవ్య కుటుంబాన్ని పరామర్శిస్తున్న కృష్ణదాస్

నవ్య కుటుంబానికి పరామర్శ

ప్రజాశక్తి- నరసన్నపేట

పట్టణంలోని జోగిపేటలో నివాసం ఉంటున్న మృతురాలు నవ్య కుటుంబాన్ని ఆదివారం జిల్లా పార్టీ అధ్యక్షులు, నరసన్నపేట సీనియర్ శాసనసభ్యులు ధర్మాన కృష్ణదాస్ పరామర్శించారు. నవ్య మరణాన్ని జీర్ణించుకోలేక తండ్రి కూడా మరణించడం చాలా బాధాకరమన్నారు. తండ్రి, కూతురు మరణానికి కారణమైన నింధితులకు కఠిన శిక్షపడే విధంగా చూస్తానని, ఇప్పటికే ఫోన్లో ఎస్‌పితో మాట్లాడానన్నారు. నవ్య కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాపాన్ని తెలియజేశారు. బాధిత నవ్య కుటుంబానికి వైసిపి అండగా నిలబడుతుందన్నారు. ఆయనతో పాటు జెడ్‌పిటిసి చింతు రామారావు, సుడా చైర్మన్ కోరాడ చంద్రభూషణ గుప్త, మేజర్ పంచాయతీ సర్పంచ్ బూరెల్ల శంకర్, పట్టణ వైసిపి అధ్యక్షులు పొట్నూరు సాయిప్రసాద్, మండల పరిషత్ విప్ వైశ్యరాజు కేశవరాజు, వార్డ్ మెంబర్ టెంకల రాంజీ ఉన్నారు.

పట్టాదారు పాస్ పుస్తకాన్ని పంపిణీ చేస్తున్న వామాక్షి

గ్రామాల అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి- పలాస

వైసిపి ప్రభుత్వంలో గ్రామాలు అభివృద్ధికి కృషి చేస్తుందని అల్లుకోల సర్పంచ్ దువ్వాడ వామాక్షి అన్నారు. మండలంలో అల్లుకోలలో ఆదివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రూ.80 లక్షల వ్యయంతో సచివాలయం, హెల్త్ క్లినిక్, రైతు భరోసా కేంద్రం నిర్మాణం చేపట్టి ప్రారంభించామని అన్నారు. గ్రామంలో ఇంకేమైనా సమస్యలు ఉంటే ప్రతిపాదనలు పెట్టి పనులు చేపడతామని చెప్పారు. భూములు రీ సర్వే ప్రభుత్వం చేపడుతుందని అన్నారు. అనంతరం రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల సచివాలయ కన్వీనర్ దువ్వాడ రవి కుమార్, కార్యదర్శి సద్గుణ బాబు, శ్రీనివాసరావు, షణ్ముఖరావు పాల్గొన్నారు.

ఆర్థికసాయాన్ని అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

ఆమదాలవలస : మండలంలోని బెలమాం గ్రామ పంచాయతీ పరిధిలోని లొద్దలపేట గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన ఇలపండ రామారావు కుటుంబానికి పూర్వ విద్యార్థులు ఆర్థిక సహాయాన్ని అందజేశారు. 1995-96 సంవత్సరంలో 10వ తరగతి చదివిన స్నేహితులు రూ.20వేలు ఆర్థిక సహాయాన్ని రామారావు భార్యకు అందజేశారు. రామారావుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఆడపిల్లలకు వారి వంతు సహాయంగా ఈ మొత్తాన్ని అందజేసినట్లు తెలిపారు. ఐదు రోజుల వ్యవధిలో రామారావుతో పాటు తన తల్లి కూడా మరణించడం బాధాకరమని పూర్వ విద్యార్థులు పేర్కొన్నారు. ఈ సహాయ కార్యక్రమంలో పైడి హరిప్రసాద్, మడ్డి అన్నాజీరావు, పెనుగుర్తి సంగమేశ్వరావు, పైడి ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

మరుగుదొడ్లకు తాళాలు

టెక్కలి : మండలంలో నౌపడ ఆర్ఎస్ రైల్వే జంక్షన్‌లో ఉన్న మరుగుదొడ్లు గదులకు ఎప్పుడు తాళాలు వేసి ఉండడం పట్ల రైల్వే ప్రయాణికులు తీవ్ర ఆవస్థలకు గురవుతున్నారు. నౌపడ రైల్వే జంక్షన్ కావడంతో పలు రైళ్ల రాకపోకలు, నిలుపుదలలు జరుగుతుంటాయి. ప్రయాణీకుల తాకిడి కూడా ఎక్కువగా ఉంటుంది. ఆయితే పలు రైళ్ల రాకపోకలు సందర్భంగా ఆలస్యం కావడంతో ప్రయాణీకులు స్టేషన్లోనే ఎక్కువ సమయం గడపాల్సి వస్తుంది. ఇటువంటి నేపథ్యంలో స్టేషన్లో ఉన్న మరుగుదొడ్లు గదులకి తాళాలు వేసి ఉండడంతో ప్రయాణీకుల మౌలిక అవసరాలు తీరడం లేదని వాపోతున్నారు. ఆదే విధంగా ప్రస్తుతం ఉన్న మరుగుదొడ్లు గదులకి పక్కనే దివ్యాంగులకు చెందిన మరుగుదొడ్లు భవనం నిర్మాణం జరిగినప్పటికీ ఆది కూడా తాళాలు వేసి ఉండడంతో ప్రయాణికులు ఇబ్బందులకు గురౌతున్నారు. మరుగుదొడ్లు గదులకి తాళాలు ఎందుకు వేసారని ప్రయాణికులు ప్రశ్నించినా సమాధానం రాకపోవడంతో ప్రయాణికులు ఆసహనాన్ని వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి స్టేషన్లో ఉన్న మరుగుదొడ్లు గదులకి తాళాలు తీయించాలని కోరుతున్నారు.

తేజేశ్వరరావు పరామర్శ

కొత్తూరు: మండల బార్. అసోసిసిషన్ అధ్యక్షుడు కోమనపల్లి గోపాల్‌దాస్ నాయుడు అనారోగ్యంతో ఇటీవల మృతి చెందడంతో వారి కుటుంబాన్ని పారిశ్రామిక వేత్త, పాతపట్నం నియోజకవర్గ నాయకులు సిరిపురం తేజేశ్వరరావు ఆదివారం పరామర్శించారు. గోపాల్‌దాస్ నాయుడు చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ యన వెంట సుధాకర్, కాసిబాబు నాయుడు, శ్రీదేవి, హేమలత ఉన్నారు.

పరామర్శిస్తున్న తేజేశ్వరరావు

'పోస్టు' గొంతు మాయం...!

నేడు ప్రపంచ తపాలా దినోత్సవం

ప్రజాశక్తి- రణస్థలం

ఖాకీ చొక్కా వేసుకొని.. సైకిల్‌పై ఇంటింటికీ తిరుగుతూ పోస్టు అనే గొంతు మాయమైంది. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక విప్లవంతో ఈమెయిల్స్, వాట్సాప్ అందుబాటులోకి రావడంతో క్రమేణా తోకలేని పిట్ట కనుమరుగవుతుంది. అయినా కొందరు మాత్రం ఉత్తరాలు రాయడం మానుకోలేదు. కాలానికి అనుగుణంగా తపాలాశాఖ సైతం సంస్థను కాపాడుకునేందుకు వివిధ రూపాల్లో ప్రజలకు సేవలందిస్తుంది.

ఉత్తరం అందుకోవడం, రహస్యంగా విప్పి చదువుకోవడం, ఎవరైనా వస్తుంటే దిండుకింద దాచుకోవడం ప్రేమికులకు ఖర్చులేని ఓ మధురానుభూతి. దూరంగా సైన్యంలోనో, మరో ఉద్యోగంలోనో ఉన్న భర్త, కొడుకో ఉత్తరం రాస్తాడనీ, క్షేమ సమాచారం చెబుతాడనీ వీధి వంక చూస్తూ గడిపే కాలం ఇంకా మధురమైనది. ఆధునిక కాలంలో సాంకేతికత అందుబాటులోకి రావడంతో ఉత్తరాలు రాసుకునే తరం అంతరించిపోయింది. ఇంటికి వచ్చిన ఉత్తరాలను పొడవాటి ఇనుప కమ్మీకి గుచ్చి ఉంచడం, అవసరమైనప్పుడు మళ్లీ తీసి చదువుకోవడం రెండు, మూడు దశాబ్దాల క్రితం ప్రతి ఇంటా ఉండేది. ఆ రోజుల్లో చాలా తక్కువ ఖర్చుతో సమాచారాన్ని దూరతీరాల్లోని ఆత్మీయులకు చేరవేయడానికి తపాలా రంగం అందించిన సేవలు వెలకట్టలేనివి. అలాంటి పోస్టల్ శాఖకు సంబంధించి ఏటా అక్టోబరు 9న ప్రపంచ, 10న జాతీయ తపాలా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

పోస్టల్ డే ఏర్పడిందిలా....

గతంలో సమాచార మార్పిడికి క్షేమ సమాచారం తెలుసుకునేందుకు పోస్టుకార్డే ప్రధాన ఆధారంగా ఉండేది. సాంకేతికంలో వచ్చిన మార్పులు దీనిపై పెనుప్రభావం చూపాయి. ప్రస్తుతం పోస్టుకార్డు మనుగడ కోసం పోరాడుతుంది. సెల్‌ఫోన్లు, కంప్యూటర్లు, సోషల్ మీడియా ఇతర సాంకేతిక సాధనాలు అందుబాటులోకి వచ్చిన తర్వాత దీని అవసరం తగ్గిపోయింది. ఈ- మెయిల్స్ చాలా వరకు ప్రస్తుతం పోస్టుకార్డు పాత్రను పోషిస్తున్నాయి. కొన్ని ప్రదేశాల్లో మాత్రం ఇప్పటికీ పోస్టుకార్డునే వినియోగిస్తున్నారు.

చరిత్రలోకి వెళ్తే మెసేంజర్ రూపంలో తపాలా సర్వీసులుండేవి. వీళ్లు నడిచి, గుర్రాళ్ల మీద వెళ్లి రాతప్రతులను చేరవేసేవారు. 1600-1700 సంవత్సరాల్లో అనేక దేశాల వారు జాతీయ తపాలా వ్యవస్థను నెలకొల్పుకొని ఆయా దేశాల నడుమ తపాలా సౌకర్యాల్ని అందించుకునేందుకు ద్వైపాక్షిక ఒప్పందాలు చేసుకున్నారు. 1878లో యూనివర్సల్ పోస్టల్ యూనియన్‌గా మారింది.

ఇన్‌ల్యాండ్ లెటర్ కార్డు

పోస్ట్ బాక్స్

ఇది 1948లో ఐక్యరాజ్య సమితికి ప్రత్యేక ఏజెన్సీగా రూపాంతరం చెందింది. 1969 అక్టోబరు 1 నుంచి నవంబరు 16 వరకు జపాన్ టోక్యోలో అనేక సదస్సులు నిర్వహించారు. ఈ సదస్సులో ప్రతినిధులు అక్టోబరు 9న వరల్డ్ పోస్టల్ డేను నిర్వహించాలని తీర్మానించారు.

పోస్టల్ సేవలు

ఉత్తరాల పంపిణీ, స్పీడ్ పోస్టు, ఈ పోస్టు సర్వీసు, ఆధార్ నమోదు, ఆలయాల ప్రసాదాల సర్వీసు, గోదావరి జలాలు అందజేసే సర్వీసు తదితర సేవలు అందిస్తుంది. కనిష్ఠ, గరిష్ఠ పెట్టుబడి పథకం, టైం డిపాజిట్, సుకన్య సమృద్ధి ఖాతా, పోస్టల్ లైఫ్ ఇన్స్యూరెన్స్, నెలవారీ ఆదాయం వంటి పథకాలు అమలు చేస్తుంది. ఇప్పటికి పోస్టల్‌శాఖ ప్రజలకు ఎదోఒక విధంగా సేవలు అందిస్తూనే ఉంది.

అంగన్వాడీ సమస్యలను పరిష్కరించాలి

ప్రజాశక్తి-శ్రీకాకుళం అర్బన్

అంగన్వాడీలకు వేతనాలు పెంచాలని, సమస్యలు పరిష్కరించాలని, ఎఫ్ఆర్ఎస్ యాప్ రద్దు చేయాలని ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు కె.కళ్యాణి, సిఐటియు జిల్లా అధ్యక్షులు సిహెచ్ అమ్మన్నాయుడు డిమాండ్ చేసారు. అంగన్వాడీలకు తెలంగాణ కంటే అదనంగా రూ.వెయ్యి వేతనం ఇస్తామని సిఎం జగన్మోహన్ రెడ్డి ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సిఐటియు) జిల్లా కమిటీ సమావేశం ఆదివారం శ్రీకాకుళం సిఐటియు కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలకి సరుకులు, పాలు, గుడ్లు ఇచ్చే సందర్భంలో ఫేస్ యాప్ అమలు చెయ్యాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అనారోగ్య సమస్యలు, బెడ్‌రెస్ట్ ఉన్న వాళ్ళకు కూడా ఫేస్ యాప్ అమలు చెయ్యాలని బలవంతం చేస్తున్నారన్నారు. దీనివల్ల

మాట్లాడుతున్న కళ్యాణి

అంగన్వాడీలు, గర్భిణీలు, బాలింతలు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారన్నారు. అంగన్వాడీ సెంటర్ పరిధిలో సంతకం పెట్టి ప్రభుత్వం ఇచ్చే ఆహార సరుకులు తీసుకోవటానికి అవకాశం కల్పించాలని డిమాండ్ చేసారు. తెలంగాణలో అంగన్వాడీలకు రూ.13,500 వేతనం ఇస్తున్నారని, అలాగే పిఆర్‌సి అమలు చేయడానికి, గ్రాట్యూటీ చెల్లించడానికి అంగీకరించిందని తెలిపారు. అదే మాదిరిగా ఎపిలోనూ అమలు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి ఇచ్చిన హామీ అమలు చేయాలని కోరితే రాష్ట్ర ప్రభుత్వం నిర్బంధం ప్రయోగించడం తగదన్నారు. రకరకాల యాప్‌లు తెచ్చి అంగన్వాడీలపై విపరీతమైన పనిభారం పెంచారని ఆవేదన వ్యక్తం చేసారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, మినీ వర్కర్లకు మెయిన్ వర్కర్లతో సమానంగా వేతనాలు ఇవ్వాలని డిమాండ్ చేసారు. అంగన్వాడీలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలని డిమాండ్ చేసారు. నందిగాం మండలం ఎస్ఆర్‌కె పురంలో ఖాళీ అయిన కార్యకర్త స్థానంలో అదే కేంద్రంలో పని చేస్తున్న డిగ్రీ పాసైన హెల్పర్‌కు ప్రభుత్వ జిఒ ప్రకారం పదోన్నతి కల్పించాలని, హెల్పర్ల ప్రమోషన్లలో రాజకీయ జోక్యం అరికట్టాలని కోరారు. పెరిగిన ధరలకనుగుణంగా మెనూ చార్జీలు పెంచాలని, గ్యాస్‌ను ప్రభుత్వమే సరఫరా చెయ్యాలని డిమాండ్ చేసారు. 2017 నుండి పెండింగ్ టిఎ బిల్లులు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని కోరారు. లబ్ధిదారులకు నాణ్యమైన ఆహారాన్ని సరఫరా చేయాలని, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని డిమాండ్ చేసారు. ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఎన్.హైమావతి, పి.లతాదేవి, పి.ఆదిలక్ష్మి, కె.సుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయ కార్యదర్శులకు సన్మానం

శ్రీకాకుళం అర్బన్ : కుమార్ రాజును సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శిగా పని చేస్తున్న బుర్రి కుమార్ రాజును పల్నాడులోని అంతర్జాతీయ గుర్తింపు పొందిన శ్రీశ్రీ కళా వేదిక ఆధ్వర్యాన ఘనంగా సన్మానించారు. ఆదివారం జరిగిన కార్యక్రమంలో శత కవి సమ్మేళనంలో కవితా గానం చేశారు. శ్రీశ్రీ కళావేదిక అంతర్జాతీయ అధ్యక్షుడు డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కొల్లి రమావతి, జి.ఈశ్వరీభూషణం, పల్నాడు జిల్లా అధ్యక్షులు డాక్టర్ శాంతాభాయి, గుండాల రాకేష్‌లు ప్రశంసాపత్రాలను అందజేశారు.

రణస్థలం: గ్రంథాలయాలు సద్వినియోగం చేసుకొని మంచి విద్యావంతులు కావాలని గ్రంథాలయాధికారిని పి.వరలక్ష్మి అన్నారు. స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులు ముందుగా దిన పత్రికల పఠనం, కథలు చదివించడం, దేశ నాయకుల జీవిత చరిత్రలను చడివించారు. పుస్తక పఠనం వలన భవిష్యత్తులో విజయాలను సాధించవచ్చని, మంచి మార్గాన్ని అనుసరించి మంచి విజయాలను సాధించవచ్చనని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని, విద్యార్థులు, పాఠకులు, గ్రంథాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లావేరు: స్థానిక శాఖాగ్రంథాలయంలో ఆదివారం చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. గ్రంథాలయాధికారి మురపాక శ్రీనివాసరావు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ప్రాథమిక స్థాయి నుండే పద్యాలు, భావాలు నేర్చుకోవాలన్నారు. ఈ సందర్భంగా బాగా పద్యాలు చదివిన ముగ్గురు విద్యార్థులకు గ్రంథాలయం తరుపున బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సహాయకులు ఎ.గడ్డియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జగన్నాథరావు

పాస్‌పుస్తకాల మార్పిడి ఉల్లంఘనే

మేధావుల ఫోరం అధ్యక్షులు జగన్నాథం

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

భూమిపై రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హక్కుపత్రం పట్టాదారు పాసు పుస్తకంగా ఇచ్చిన తర్వాత తిరిగి మార్చడం రెవెన్యూ చట్టం 71 ప్రకారం ఉల్లంఘనే అవుతుందని, పాసుపుస్తకంలో ఎలాంటి లోపాలు ఉన్నా వాటిని సరిదిద్దాల్సిన బాధ్యత జిల్లా యంత్రాంగంపై ఉందని మేధావుల ఫోరం అధ్యక్షులు, పూర్వ ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జి పప్పల జగన్నాథరావు పేర్కొన్నారు. నగరంలోని పిఎన్ కాలనీలో ఉన్న నారాయణ తిరుమల సమావేశ మందిరంలో ఆదివారం ఫోరం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ భూమి కొనుగోలు సమయంలో భాగ్యవంతులు, పేదలు అన్న తేడాల ఏకుండా అందరి నుంచి స్టాంపు డ్యూటీని ప్రభుత్వం పొందాలన్నారు. తమ్మినేన వాసుదేవరావు మాట్లాడుతూ పట్టాదారు పాసు పుస్తకాల జారీలో విఆర్ఒలు తీవ్ర జాప్యం చేస్తున్నారని ఆయన దృష్టికి తీసుకొచ్చారు. రైతులకు ఇవి తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. సమావేశంలో సభ్యులు దుర్గాప్రసాద్, ఎం.అన్నాజిభట్లు, వివిఎస్ శ్యాం, సిహెచ్.కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి కృషి

మంత్రి సీదిరి అప్పలరాజు

పలాస: నియోజకవర్గ అభివృద్ధి కృషి చేస్తున్నామని మత్స్య, పశుసంవర్ధకశాఖ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు అన్నారు. కాశీబుగ్గలో ప్రగతి భవన్ సమీపంలో జగనే కావాలి... జగనే రావాలి కార్యక్రమాన్ని పలాస మున్సిపల్ చైర్మన్ బల్ల గిరిబాబు అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. అనంతరం జరిగిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు దొరికిన దొంగ అయితే... మరో దొంగ నారా లోకేష్ ఢిల్లీ వీధుల్లో తిరుగుతున్నాడని ఎద్దేవా చేశారు. రాష్ట్రంలో 1.40 కోట్ల కుటుంబాలకు రూ. 3 లక్షల కోట్లు పథకాల రూపంలో లబ్దిదారులకు చెల్లించామని అన్నారు. పలాస, సోంపేట నియోజకవర్గాల్లో ఆరవై ఏళ్లు పరిపాలించి ఏమి అభివృద్ధి చేశారో చెప్పగలరా? అని గౌతు శివాజీని ప్రశ్నించారు. తాను ఎమ్మెల్యేగా, మంత్రిగా నాలుగున్నర ఏళ్లలో కోట్ల రూపాయలు వెచ్చించి అభివృద్ధి పనులు చేపడుతున్నామని చెప్పారు. రానున్న ఎన్నికల్లో తమ ఓటు హక్కును ఉపయోగించి గౌతు కుటుంబీకులను ఓడించి పలాస నుంచి తరిమేద్దామన్నారు. గృహ సారథులు 50 చొప్పున ఓట్లు వేయించ గలిగితే పలాసలో గెలుపు తథ్యమన్నారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపు కోసం

వైసిపిలోకి ఆహ్వానిస్తున్న మంత్రి అప్పలరాజు

త్రికక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. చిన్నచిన్న సమస్యలు ఉంటే అందరం కూర్చుని పరిష్కారంచి కలిసి కట్టుగా పనిచేయాలన్నారు. సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు పైల వెంకటరావు చిట్టి, పలాస ఎంపిపి ప్రతినిధి ఉంగ సాయికృష్ణ, మందస ఎంపిపి డొక్కారి దానయ్య, హనుమంతు వెంకటరావు, వైస్ చైర్మన్ మీసాల సురేష్‌బాబు, కౌన్సిలర్లు, సర్పంచ్లు, ఎంపిటిసిలు పాల్గొన్నారు. జరిగింది. అనంతరం పలాస మండలం చినంచల స్వతంత్ర ఎంపిటిసి బమ్మిడి దుర్యోధన, సర్పంచ్ అభ్యర్థి ముకుంద, మున్సిపాలిటీలో టిడిపి నాయకులు మంత్రి సమక్షంలో వైసిపిలో చేరారు. వారికి మంత్రి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

అగ్రికల్చర్ డిప్లమా కోర్సులు

ప్రజాశక్తి- కవిటి

పదో తరగతి విద్యార్హతతో స్థానిక ఎస్‌విజె వ్యవసాయ కళాశాలలో అగ్రికల్చర్ డిప్లొమా కోర్సులకు అవకాశం కల్పిస్తున్నట్లు కరస్పాండెంట్ బివివి ప్రసాదరావు(కింగ్) తెలిపారు. ఆసక్తి కలిగిన అర్హులైన అభ్యర్థులు అక్టోబర్ 10లోగా తమ విద్యార్హత ధ్రువీకరణ పత్రాలతో కళాశాలలో సంప్రదించాలని కోరారు. ఫీజు రీయింబర్స్మెంట్‌తో పాటు వసతి సదుపాయం కూడా కళాశాలలో అందుబాటులో ఉందన్నారు. మరిన్ని వివరాలకు సెల్:9948682689 నెంబరుకు సంప్రదించాలన్నారు.

200 లీటర్ల సారా ఊట ధ్వంసం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో సవర మర్రిపాడు గ్రామంలో ఆదివారం పాతపట్నం, మెళియాపుట్టి పోలీసులు కార్డన్ చర్చ్ నిర్వహించారు. ఇందులో భాగంగా సారా తయారీకి సిద్ధంగా ఉన్న 1200 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు స్థానిక ఎస్ఐ టి.రాజేష్ తెలిపారు. ఇందుకు సంబంధించి పెద్దింటి నూకరాజు, పెద్దింటి వెంకటరావును అరెస్టు చేసినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పాతపట్నం సిఐ వినోద్‌బాబు, పాతపట్నం, మెళియాపుట్టి పోలీస్ సిబ్బంది ఉన్నారు.

పొందూరు: విజయవాడకు వెళ్తున్న వైసిపి నాయకులు

ఇచ్ఛాపురం: విజయవాడ వెళ్తున్న వైసిపి నాయకులు

విజయవాడకు వైసిపి నాయకుల పయనం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

సిఎం జగన్ మోహన్ రెడ్డి నేతృత్వంలో సోమవారం జరగనున్న పార్టీ ప్రతినిధుల సదస్సుకు టెక్కలి నియోజకవర్గ వైసిపి శ్రేణులు ఆదివారం విజయవాడ పయనమయ్యారు. నియోజకవర్గ సమన్వయకర్త, టెక్కలి జెడ్‌పిటిసి దువ్వాడ వాణి నేతృత్వంలో నియోజకవర్గంలో నాలుగు మండలాల వైసిపి శ్రేణులు ఆమెతో పాటు బస్సులో వెళ్లారు.

ఇచ్ఛాపురం: ఈ నెల 9న విజయవాడలో జరగనున్న వైసిపి ప్రజా ప్రతినిధులు, నామినేటెడ్ పదవులు పొందిన నేతలు, పార్టీ పదవులు పొందిన నేతలతో సిఎం నిర్వహించనున్న సమావేశానికి ఇచ్ఛాపురం నుండి నేతలు ఆదివారం రాత్రి బయలు దేరారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రాజ్యలక్ష్మి, పట్టణ అధ్యక్షుడు ప్రకాశరావు పట్నాయక్, జిల్లా వైసిపి ప్రచార కమిటీ చైర్మన్ తాడి ఆదిరెడ్డి, జిల్లా క్రిస్టియన్ మైనారిటీ సెల్ అధ్యక్షుడు ప్రత్తి అన్వేష్, రెడ్డికి కార్పొరేషన్ చైర్మన్ లోకేశ్వరరావు, జెసిఎస్ కన్వీనర్ సాలీనా ఢిల్లీ, మండల పార్టీ అధ్యక్షుడు రాజశేఖరరెడ్డి తదితరులు పయనమయ్యారు. కొంత మంది వాహనాల్లో, మరికొంత మంది ట్రైన్‌లో వెళ్లారు.

పొందూరు: విజయవాడ ఇందిరాపార్క్‌లో సిఎం జగన్మోహన్ రెడ్డి సోమవారం నిర్వహించనున్న వైసిపి ప్రతినిధుల సమావేశానికి ఆదివారం మండలం నుంచి పలువురు వైసిపి ప్రతినిధులు వెళ్లారు. పార్టీ కార్యాలయం నుంచి వచ్చిన ఆహ్వానం మేరకు సమావేశానికి హాజరుకానున్నారు. ఈ సమావేశానికి జెడ్‌పిటిసి లోలుగు కాంతారావు, ఎంపిపి ప్రతినిధి కిల్లి నాగేశ్వరరావు, మండల అధ్యక్షుడు పప్పల రమేష్ కుమార్, పిఎసిఎస్ అధ్యక్షులు కొంచాడ రమణమూర్తి, ఎఎంసి చైర్మన్ బాడాన సునీల్ కుమార్, మండల జెసిఎస్ బాడాన వెంకట కృష్ణారావు, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, వైస్ ఎంపిపి ప్రతినిధి సూరపునాయుడు తదితరులు వెళ్లారు.

వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి- టెక్కలి రూరల్

టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం వెనుక భాగంలో టెక్కలికి చెందిన కురమాన అమ్మన్నమ్మ(70) మృతదేహం లభ్యమైంది. కొత్తమ్మతల్లి వీధి సమీపంలో నివాసం ఉంటున్న అమ్మన్నమ్మ శనివారం ఉదయం ఇంటి నుండి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు టెక్కలి పోలీసులకు సమాచారం అందించారు. ఆమె కోసం గాలింపు చర్యలు చేపడుతున్న తరుణంలో వృద్ధురాలు మృతిచెంది ఉండటంతో కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు.



అమ్మన్నమ్మ మృతదేహం



వృద్ధురాలిని పరీక్షిస్తున్న వైద్యులు సురేష్

కొంచాడలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- పొందూరు

మండలం కొంచాడ గ్రామంలో శ్రీకాకుళం నగరానికి చెందిన ప్రముఖ వైద్యులు బొడ్డేపల్లి సురేష్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన సుమారు 500 మందికి బిపి, షుగర్ వంటి పలు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశారు. కార్యక్రమంలో సన్‌రైజ్ ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

పనులను పరిశీలిస్తున్న కమిషనర్ నాగేంద్ర కుమార్

రోడ్డు పనులు వేగవంతం

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ మున్సిపాలిటీ విస్తరణ పనులు వేగవంతం చేయాలని కమిషనర్ టి.నాగేంద్ర కుమార్ అన్నారు. కాశీబుగ్గలో రోడ్డు విస్తరణ పనులను ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కెటి రోడ్డుపై ఉన్న విద్యుత్ లైన్లు, స్తంభాలు, విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు పక్కకు మళ్లించాలన్నారు. ప్రస్తుతం రోడ్డుపై ఉండడంతో పనులు చేయలేకపోతున్నామని, తక్షణమే పక్కకు మళ్లించాలని విద్యుత్ శాఖ అధికారులకు కోరారు. ఆయనతో పాటు విద్యుత్ లైన్లు ఇన్‌స్పెక్టర్ గార రాజారావు, మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

బిసి కులగణనను చేపట్టాలి

ప్రజాశక్తి- టెక్కలి

బీహర్ రాష్ట్రం మాదిరిగానే ఎపిలో కూడా కులగణన జరిపించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా శాఖ ఆధ్యక్షులు బోకర నారాయణరావు ఆదివారం ప్రకటనలో డిమాండ్ చేశారు. జాతీయ స్థాయిలో కులగణన జరిపించేందుకు కేంద్రం అనుమతులు మంజూరు చేయాలన్నారు. కులగణన వలన ఎస్‌సి, ఎస్‌టి, బిసిల్లో చైతన్యం తీసుకువచ్చేలా ఆవగాహన కల్పించాలన్నారు. వీటి వలన విద్య, ఉద్యోగ, పరిపాలన రంగాల్లో తమ హక్కులు కాపాడుకోవాల్సిన బాధ్యత ఉంటుందన్నారు. బిసి కులగణనపై వ్యతిరేకంగా పెత్తందారీ కులాలు వేసిన పిటీషన్లు సుప్రీం కోర్టు కొట్టి వేసిందన్న విషయం గ్రహించాలన్నారు. కులగణనను ఆయా రాష్ట్రలు చేపట్టేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువస్తామని నారాయణరావు ప్రకటనలో తెలిపారు.

రేపు విద్యుత్ సరఫరా నిలుపుదల

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఈ నెల 10వ తేదీన విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ సత్తారు బయ్యన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 33/11 కెవి సబ్‌స్టేషన్ పరిధిలో గల 11 కెవి టౌన్-1, రూరల్ ఫీడర్ పరిధిలో గల ఎఫ్‌సిఐ జంక్షన్ రోడ్డు క్రాసింగ్ నిమిత్తం పొడవాటి స్తంభాలు వేయడం జరిగిందని తెలిపారు. స్తంభాలకు తీగలను అమర్చడం కోసం మంగళవారం ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సొట్టవానిపేట, టిజిఆర్ నగర్, ఎఫ్‌సిఐ, బైరివానిపేట, శిలగాం సింగువలస, సేపాన చంద్రయ్యపేట, వంజంగి, గట్టుముడిపేట, దూసి, దూసి కాలనీ తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడునని పేర్కొన్నారు. ఈ అసౌకర్యాన్ని ప్రజలందరూ గమనించి విద్యుత్ అధికారులకు సహకరించాలని కోరారు.

నేడు యువ గర్జన

ఆమదాలవలస : గడచిన కొన్నేళ్లుగా జిల్లా వెనుకబాటు తనానికి గురై ఉపాధి కోసం వలసలు పోతున్న జిల్లా ప్రజల ఆవేదనను తెలియజేయడానికే సోమవారం యువగర్జన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. నియోజకవర్గంలో గత పాలకుల నిర్లక్ష్యం వల్ల చక్కెర కర్మాగారం, జూట్ పరిశ్రమలు, కాన్‌కాస్ట్ వంటి పరిశ్రమలు మూతపడి ప్రజలు వలసలు వెళ్లేందుకు కారణమయ్యాయని, ఈ పాపానికి కారణం గత పాలకులేనన్నారు. యువత, ప్రజల ఆవేదనను వినిపించేందుకే ఈ కార్యక్రమాన్ని జిల్లా కేంద్రంలోని రామలక్షణ జంక్షన్ వద్ద నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా యువత, ప్రజలందరూ ఈ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

ఆర్థికసాయం అందజేస్తున్న సభ్యులు

బిసాయ్‌కు అండగా..

ప్రజాశక్తి- కవిటి

హెచ్‌ఎల్‌హెచ్ అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మాణిక్యపురానికి చెందిన అరవ్ బిసాయ్ రెండేళ్ల బాబుకి దాతలు అండగా నిలుస్తున్నారు. అరవ్ సమస్య తెలుసుకున్న ఉద్దానం సేవా సమితి రూ.10 వేలు, మజ్జిపుట్టుగ ఎస్‌జెవై సంస్థ రూ.13,150లు బాబు కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. అనంతరం వీరు మాట్లాడుతూ రెక్కాడితే గాని డొక్కాడని ఆరవ్ కుటుంబానికి అనుకోని ఆపద ఎదురైందని, దాతలు ఉదారంగా స్పందించి ఆదుకోవాలని పిలుపునిచ్చారు.

కలసికట్టుగా పనిచేద్దాం

పలాస: వైసిపి నిరంకుశ పాలనకు చరమగీతం పాడాలని, అందుకు టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు కలిసికట్టుగా పనిచేయాలని టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష అన్నారు. కాశీబుగ్గ ప్రయివేటు కళ్యాణ మండపంలో జనసేన నాయకులు సంతోష్ పండా ఆధ్వర్యాన ఆదివారం సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వంలో గిరిజనులకు తీవ్ర అన్యాయం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రానున్న ఎన్నికల్లో టిడిపి గెలుపునకు జనసేన నాయకులు కార్యకర్తలు సహకరించాలని కోరారు. సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లోడగల కామేష్, బడ్డ నాగరాజు, సప్ప నవీన్, కేదార్, సవర సుమన్, కిల్లి బాలకృష్ణ, మేడిశెట్టి మూర్తి, శివ, కె.కృష్ణారావు, వరలక్ష్మి, కిరణ్, సాయి, ఢిల్లీరావు, అఖిల్, రాజు పాల్గొన్నారు

26వ రోజుకు టిడిపి నిరసనలు

శ్రీకాకుళం అర్బన్ : చేనేత రంగాన్ని ఆదుకుని ఎంతో మంది కార్మికులను ఆదుకున్న మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబును అక్రమ పద్ధతిలో అరెస్టు చేసి జైలులో నిర్బంధించడం దుర్మార్గమని మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవి అన్నారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో ఆదివారం చేనేత కార్మికులు రిలే నిరాహార దీక్ష చేపట్టారు. దీక్షల్లో ఆమె పాల్గొని చేనేత కార్మికులతో కలిసి నూలు వడుకుతూ చంద్రబాబుకు జరుగుతున్న అన్యాయాన్ని ఎండగట్టారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సింతు సుధాకర్, పిఎంజె బాబు, గుత్తు చిన్నారావు, మాదారపు వెంకటేష్, కవ్వాడి సుశీల, రమ, తోణంగి వెంకన్న యాదవ్ పాల్గొన్నారు.

పోలాకి: పోలాకిలో చేపట్టిన టిడిపి నిరసన దీక్షకు మాజీ ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జలుమూరు జెడ్‌పిటిసి మాజీ సభ్యులు బగ్గు సుగుణమ్మ, పోలాకి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు ఎం.వెంకటఅప్పలనాయుడు, ఉలకలాపు రాంబాబు, భైరి భాస్కరరావు, రోణంకి కృష్ణంనాయుడు, చిట్టి సింహాచలం, సూరపు నారాయణదాసు, గొండు చైతన్య, మురళి, ఎం త్రినాథరావు, మోహనరావు పాల్గొన్నారు.

కొత్తూరు : చంద్రబాబు రిమాండ్‌కు నిరసనగా స్థానిక కలమాట కాంప్లెక్స్ వద్ద చేపట్టిన నిరసన దీక్షలో మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ, పి.మోహనరావు, అగతమూడి అరుణకుమార్, మాతల గాంధీ, నెల్లి అచ్యుతరావు, కోటి, ఎం.కృష్ణారావు, ఎ.మాధవరావు, బి.గోవిందరావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం అర్బన్ : నూలు వడుకుతున్న లక్ష్మీదేవి

ఇచ్ఛాపురం : చేతికి సంకెళ్లతో దీక్ష చేస్తున్న టిడిపి నాయకులు

పలాస : టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గౌతు శిరీష ఆధ్వర్యాన చేపట్టిన నిరసన దీక్ష ఆదివారానికి 26వ రోజుకు చేరుకుంది. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు, లోడగల కామేష్, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, సూరాడ మోహనరావు, శశిభూషణరావు, సురేష్, సప్ప నవీన్, సంతోష్, గంగారాం, శసనపురి మురళి, చంద్రరావు, శ్రీను, రామకృష్ణ, సత్యం, నర్సింగ్, నర్సింహులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : అక్రమంగా అరెస్ట్ చేసిన మాజీ సిఎం నారా చంద్రబాబు నాయుడుపై పెట్టిన కేసును వ్యతిరేకిస్తూ కేసు తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ టిడిపి నేతలు విన్నూత్న రీతిలో చేతులకు సంకెళ్ళ వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. పట్టణంలో గత 26రోజులుగా ఎమ్మెల్యే అశోక్ అధ్వర్యంలో రిలే నిరాహారదీక్షలు కొనసాగుతున్నాయి. ఆదివారం ర్యాలీగా వచ్చి టిడిపి రెడ్డి నాయకులు సంఘీభావం తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిసి రెడ్డిక సాధికారిక సమితి కన్వీనర్ కొండా శంకర్‌రెడ్డి, బొడ్డా మణిచంద్ర, ప్రకాష్, దక్శత కామేష్‌రెడ్డి, సాడి సహదేవ్‌రెడ్డి, చినపాన సారథిరెడ్డి, కూన అన్నపూర్ణమ్మ, లీలారాణి పాల్గొన్నారు.

మందస: రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి అధినేత చంద్రబాబు నాయుడు వల్లే సాధ్యమని టిడిపి మండల అధ్యక్షుడు భావన దుర్యోధన అన్నారు. మండలంలోని సాబకోట గ్రామంలో ఆదివారం రాత్రి బాబుతో నేను కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంపిణీ చేసి చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టు చేసిన విధానాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో వైసిపి పాలన బాగులేదని, రాష్ట్రాన్ని తాకట్టుపెట్టే పరిస్థితి వచ్చిందని, ప్రతీ ఒక్కరు ఆలోచించి రానున్న ఎన్నికల్లో ఓటుతో బుద్ధి చెప్పి వైసిపి ప్రభుత్వాన్ని గద్దె దించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో క్లస్టర్ ఇన్‌ఛార్జి తమిరి భాస్కరరావు, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ రట్టి లింగరాజు, ప్రధాన కార్యదర్శి లబ్బ రుద్రయ్య, సాబకోట గ్రామ కమిటీ అధ్యక్షుడు సవర జగన్, దోలాయి కృష్ణ, కంసు పూర్ణ, బురద పురుషోత్తం, దేబాసిస్ పండా, మంగళ పాత్రో, గోపి, బిమ్మో, సవర నాగేంద్ర, సవర పాపారావు, శ్యామ్ బేహారా, మజ్జి తులసీదాసు పాల్గొన్నారు.

మందస : పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నాయకులు

సమావేశంలో మాట్లాడుతున్న జహాహార

కామన్ సివిల్ కోడ్ అనర్థం

ప్రజాశక్తి- పలాస

వివిధ మతాలు, కులాలు, ఆచారాలు, సాంప్రదాయాలు ఉన్న భారతదేశంలో ఒకే దేశం ఒకే చట్టం పేరుతో మైనారిటీలు లక్ష్యంగా కామన్ సివిల్ కోడ్ తీసుకురావాలనే బిజెపి ప్రభుత్వ ప్రయత్నాలను తిప్పి కొట్టాలని ప్రముఖ న్యాయవాది జహాహర పిలుపునిచ్చారు. కాశీబుగ్గలో ప్రగతిశీల మహిళా సంఘం రాష్ట్ర విద్యా, వైజ్ఞానిక తరగతులు జరుగుతున్న సందర్భంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని మాట్లాడారు. ముస్లిం మైనారిటీలపై, మైనార్టీ మతం మీద దాడులు చేస్తూ, ఎన్నికల ప్రయోజనాలు కోసం ఇటువంటి నిరంకుశ చర్యలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ ఎన్నికల ప్రయోజనాల కోసం మోదీ చేస్తున్న కుట్రలన్నారు. కార్యక్రమంలో మహిళా సంఘం రాష్ట్ర నాయకులు బి.ఈశ్వరమ్మ, రమ, రాష్ట్ర అధ్యక్షులు ఎం.విష్ణు, బి.పద్మ, అనసూయ, శాంతి చిలకమ్మ, కల్పన పాల్గొన్నారు.

ఆన్‌లైన్ మోసాలపై అప్రమత్తం

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ చిగురుపల్లి వెంకటేష్ (చిన్ను) అన్నారు. ఆదివారం మండలంలోని తొగరాం గ్రామంలో ఆర్‌బిఐ పథకంలో భాగంగా యూనియన్ బ్యాంకు సౌజన్యంతో ఎస్‌ఎస్‌టి స్వచ్ఛంద సంస్థ నిర్వహణలో ఆర్థిక అక్షరాస్యతపై స్వయం శక్తి సంఘాల సభ్యులకు బ్యాంకు లావాదేవీలు, పథకాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బ్యాంకు నుండి మాట్లాడుతున్నామని ఎవరైనా ఫోన్ చేసి అకౌంట్, ఎటిఎం వివరాలను అడిగితే అటువంటి వారికి సమాచారం ఇవ్వొద్దని సూచించారు. బ్యాంకు అధికారులు ఖాతాదారుల వివరాలను ఫోన్ చేసి తెలుసుకోరన్నారు. ఎటిఎంలో అపరిచితులకు కార్డు ఇచ్చి డబ్బులు విత్‌డ్రా చేయాలని అడగరాదన్నారు. రూపే ఎటిఎం కార్డుల ప్రయోజనాలను ప్రజలకు వివరించారు. బ్యాంకులో అమలవుతున్న ప్రధానమంత్రి జీవనజ్యోతి, సురక్ష బీమా యోజన ఇన్సూరెన్స్ పథకాల వివరాలను క్షుణ్ణంగా వివరించారు. సైబర్ మోసాలకు గురైనప్పుడు 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ 14448 టోల్ ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఎఫ్‌టి శ్యామల, సిఎఫ్ఎల్ కో-ఆర్డినేటర్ రామారావు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న వెంకటేష్

కషాయాల తయారీ

ప్రజాశక్తి- రణస్థలం/రూరల్

ప్రకృతి వ్యవసాయ సేద్యానికి జిల్లేడు ద్రావణం రామబాణంగా పనిచేస్తుందని ప్రకృతి వ్యవసాయ సేద్య రీజనల్ టెక్నికల్ అధికారి హేమసుందర్ అన్నారు. మండలంలోని పైడిపేట గ్రామంలో పైడి సత్తిబాబు 10 సెంట్లు విస్తీర్ణంలో ఎటిఎం మోడల్ క్షేత్ర సందర్శన ఆదివారం చేశారు. ఆనంతరం వేల్పురాయి గ్రామంలో పలువురు రైతులకు 600 లీటర్లు జిల్లేడు ద్రావణం తయారు చేసి అవగాహన కల్పించి మాట్లాడుతూ భావితరాలకు నాంది ప్రకృతి వ్యవసాయం అన్నారు. ఈ జిల్లేడు ద్రావణం తయారీకి 20 కేజీల జిల్లేడు ఆకులు, 20 లీటర్ల ఆవు మూత్రం ఉండాలన్నారు. 200 లీటర్ల ద్రావణం తయారీకి 20 కేజీల జిల్లేడు ఆకులను దంచుకొని అందులో వేయాలి, అందులో 20 లీటర్ల ఆవు మూత్రాన్ని కలిపి. 170 లీటర్ల నీటిని పోసుకోవాలి. ఈ మొత్తాన్ని డ్రమ్ములో వేసుకొని ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం కలుపుకుంటే మూడు రోజుల్లో జిల్లేడు ద్రావణం తయారవుతుంది. ఈ తయారైన జిల్లేడు ద్రావణం ఏడు రోజుల వరకు నిల్వ ఉంటుందన్నారు. ఈ జిల్లేడు ద్రావణం పది లీటర్లు ఒక ఎకరానికి స్ప్రే చేసుకుంటే పోటాస్ లోపాన్ని అధిగమించవచ్చని, రసం పీల్చే పురుగును నివారించడానికి, పంట కావాల్సిన అన్ని రకాల సూక్ష్మ పోషకాలను ఈ జిల్లేడు ద్రావణం ద్వారా అందుతుందన్నారు. గ్రామంలో రైతులతో స్వయంగా తయారుచేయించి అవగాహన కల్పించారు. ముఖ్యంగా వరి సేద్యంలో పొట్ట దశలో అత్యంత శ్రద్ధ అవసరమని, జిల్లేడు ఆకులు ద్రావణం పిచకారి చేసుకుంటే చీడపీడలు భారీ నుంచి పంటలను రక్షిస్తుందన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కంబపు కృష్ణ, సిబ్బంది ప్రశాంత్, రాంబాబు, సత్యనారాయణ, శివశంకర్, సత్యవతి, సూర్యకాంతం, మాధవి, సంతోషి, లక్ష్మి, రమణమ్మ, ప్రమీల, రైతులు పాల్గొన్నారు.

లావేరు: వరిపంటలో కాయకాండం తొలుచే పురుగు, తెల్లదోమ, రసంపీల్చే తదితర పురుగులు కషాయంతో నివారణ అవుతుందని ప్రకృతి వ్యవసాయం రీజనల్ అధికారి హేమసుందర్ అన్నారు. ఆదివారం మండలంలోని కొత్తకుంకం యూనిట్లోని లక్ష్మీనారాయణపురంలో సామూహికంగా కషాయం తయారు చేసే విధానాన్ని రైతులకు వివరించారు. ఈ సందర్భంగా సామూహకంగా బ్రహ్మాస్త్రం 50కిలోలు, తూటి కషాయం 50 కిలోలు, అజ్ఞాఅస్త్రం 30 కిలోలు చొప్పున తయారు చేశారు. ఈ కషాయాలు వరిలో వేస్తే తెగులు, పురుగు నివారణ జరిగి మంచి దిగుబడులు సాధించవచ్చునన్నారు. కార్యక్రమంలో సిబ్బంది బాబాజీ, గోవిందరెడ్డి, కృష్ణ, అప్పారావు, రాంబాబు, సోమశేఖర్, మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

రణస్థలం : జిల్లేడు ద్రావణం తయారు చేస్తున్న ప్రకృతి వ్యవసాయ సిబ్బంది

ఆమదాలవలస : మండలంలోని చేపేనపేట యూనిట్‌లో జి.కె.వలస, నిమ్మతొర్లువాడ గ్రామాల్లో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రైతులచే ఎక్కువ మోతాదులో కషాయాలను తయారు చేయించారు. ఈ సందర్భంగా మండల యాంకర్ నక్క చిరంజీవి మాట్లాడుతూ 200 లీటర్ల తూటికాడ కషాయాన్ని రైతులచే తయారు చేయించామని తెలిపారు. డిజిటల్ ఎల్‌టు సురేష్ మాట్లాడుతూ వరి పంటలో వచ్చే దోమ నివారణకు ఈ కషాయం పనిచేస్తుందన్నారు. రైతులు ఈ కషాయాన్ని తయారు చేసుకుంటున్నారన్నారు. జానకిరాం, కృష్ణవేణి పాల్గొన్నారు.